# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
12-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:112

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## మూగబోయిన స్వర కోయిల



కోట్లాది హృదయాలు గెలుచుకున్న విఖ్యాత గాయని ఎస్.జానకి కన్నుమూత

వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతూ మైసూరు ఆస్పత్రిలో చికిత్స

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో గుండెపోటుతో తనువు చాలింపు

ప్రజల సందర్శనార్థం నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహారాజ కాలేజ్ గ్రౌండ్స్‌లో పార్థివదేహం

ప్రభుత్వ లాంఛనాలతో మైసూరు బోగాదిలో నేటి సాయంత్రం అంత్యక్రియలు

తెనాలి: తేనెలూరు తెలుగువారి గళ మాధుర్యాన్ని అనేక భాషల్లో శ్రోతలకు రుచి చూపించి మన కీర్తి పతాకను దశ దిశలా ఎగురవేసిన స్వర కోయిల మూగవోయిందన్న వార్త సంగీత ప్రియులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తన పాటలతో జగమే ఊయల చేసిన మధుర గాయని ఎస్.జానకి ఇక లేరన్న చేదు వార్త విని సర్వత్రా ఆవేదన వ్యక్తమైంది. తన సుమధుర కంఠంతో ఆబాలగోపాలాన్ని ఓలలాడించిన బహుభాషా గాయని ఎస్.జానకి (88) శనివారం రాత్రి మైసూరు నగరంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె పాత తాలూకాలోని నిజాంపట్నం

2లో

## మధ్యతరగతి ‘భాగ్యనగరం’!

**మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ లో దేశంలో నెంబర్ వన్**

**తాజాగా ఓ సర్వేలో వెల్లడి**



దేశంలో హైదరాబాద్ నగరం మరో ఖ్యాతిని సొంతం చేసుకుంది. దేశంలోనే మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్న నగరంగా గుర్తింపు పొందింది. ప్రైస్ అండ్ టాటా సన్స్ నివేదికలో ఈ కీలక అంశం బయటపడింది. సగటు కుటుంబ ఆదాయంలో బెంగుళూరు, చండీగఢ్, ఢిల్లీ టాప్ స్థానాల్లో ఉన్నాయి. ఇక ధనవంతుల కేంద్రాలుగా ఢిల్లీ, ముంబై, పూణే కొనసాగుతున్నాయి. అదే నివేదికలో మిడిల్ క్లాస్ జనాభా అత్యధికంగా ఉన్న నగరంగా హైదరాబాద్ అని తేలింది.

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్**

దేశంలోని టాప్ 100 నగరాలే దేశ ఆదాయం, వినియోగంలో మూడోవంతు కు పైగా వాటా కలిగి ఉన్నాయని ఈ రిపోర్టులో వెల్లడయింది.

అంతర్జాతీయ గుర్తింపు..: వాస్తవానికి జాతీయంగా కాకుండా అంతర్జాతీయంగా కూడా హైదరాబాద్ ఎంతో గుర్తింపు పొందింది. భాగ్యనగరంలో దాదాపు కోటి 20 లక్షల మంది జనాభా ఉంటారు. ఉత్తరాది తో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది ఉద్యోగం, ఉపాధిని వెతుక్కుంటూ వచ్చి స్థిరపడతారు. అందుకే హైదరాబాద్ను

2లో

## ‘కాళే శ్వరం’ మార్కు పాలిటిక్స్!

**ఉనికి చాటుకునేందుకు గులాబీ పార్టీ ఆరాటం**

**బిఆర్ఎస్ అవినీతిని కాంగ్రెస్ ఎండగట్టే ప్రయత్నం**




## ఎన్నికల బరిలో ప్రశాంత్ కిషోర్!

**బకింపూర్ ఉప ఎన్నికల్లో పోటీ**

**బిజెపికి పట్టున్న నియోజకవర్గం అది**



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తన వ్యూహాలతో ఎన్నో రాజకీయ పార్టీలకు మంచి విజయాలను అందించారు. ఎంతోమంది నేతలకు చట్టసభల్లోకి వెళ్లేందుకు వీలుగా సరైన వ్యూహాలు రచించి గెలుపు బాట అందించారు. అటువంటి ప్రశాంత్ కిషోర్ కు సొంత రాష్ట్రంలో మాత్రం సొంత వ్యూహాలు చెల్లుబాటు కాలేదు. అసెంబ్లీలో అడుగు పెట్టాలన్న కోరిక తీరలేదు.

2లో

**ఇప్పట్లో కేంద్ర మంత్రివర్గ విస్తరణ**

## లేనట్టే!

**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ జారీ**

**కీలకమైన రెండు బిల్లుల దృష్ట్యా వాయిదా**

**సెప్టెంబర్ మొదటి వారంలోనే విస్తరణ**

కేంద్ర మంత్రివర్గ విస్తరణ పై రకరకాల ప్రచారం నడిచింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగింది. మోదీ తన టీమ్ ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని.. పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని భావించారు.



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** కానీ శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజీజు వర్షాకాలం సమావేశాల అధికారిక షెడ్యూల్ను ప్రకటించారు. దీంతో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్టే. పార్లమెంట్ వేదికగా

## షాబాద్ హంతకుడికి... సీఎం రేవంత్‌కు తేడా లేదు

సీఎం, హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలం.. తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్‌రావు

రక్తపాతాన్ని కోరుకుంటున్న రేవంత్ ప్రజలు, రైతులకు క్షమాపణ చెప్పాలి

పోలీస్ స్టేషన్లను ల్యాండ్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చేశారు

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే 'కాళేశ్వరం' డైవర్షన్ డ్రామాలు

బీఆర్ఎస్ శాసనసభ పక్ష డిప్యూటీ ఫ్లోర్

3లో

## తమిళనాడులో రాజ్యాంగ వివాదం!

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాజీనామాను కోరిన విజయ్ సర్కార్

డీఎంకే హయాంలో నియమితులు కావడమే కారణం

కుదరదు అంటున్న రాజకీయ నిపుణులు



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు జోసఫ్ విజయ్. అప్పుడే రాజ్యాంగ వివాదం పెట్టుకున్నారు. రాజకీయ వివాదాలను తెచ్చుకుంటున్నారు, తాజాగా విజయ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ వివాదానికి దారితీసింది. స్వయం ప్రతిపత్తి కలిగిన అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జ్యోతి నిర్మల సామిని పదవికి రాజీనామా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. డీఎంకే ప్రభుత్వ హయాంలో నియామకమైన వివిధ

## వైటీడీఏ నా శాఖ పరిధిలో ఉంది

నా కుటుంబంలో రాజకీయాల్లో ఉండేది నేనొక్కడినే..

తాడూ లేదు బొంగరం లేదు... సర్వేలు ఇప్పుడెందుకు చేయిస్తాం

డీలిమిటేషన్, మహిళా బిల్లు, జమిలి ఎన్నికలు ఖాయంగా వస్తాయి

పూరీలు చేయమని మనుమడు అడిగితే చేశాను

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ చైర్మన్‌గా సీఎంకు ఇక్కడ క్యాంప్ ఆఫీస్ ఉంటుంది

వందల కోట్లు ఖర్చు పెట్టాననడంలో వాస్తవం లేదు

ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవస్థా నం బోర్డు సభ్యుల నియామకం తన శాఖ పరిధిలోకే వస్తుందని, వైటీడీఏ మున్సిపల్ శాఖ

2లో

# ఇప్పట్లో కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేనట్టే!

అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని.. మార్పులు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేస్తారని అర్థం అవుతోంది.

**వివాదాస్పదమైన బిల్లులు..**

ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా పీఎం, సీఎం ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్ కు సంబంధించిన 130 వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ.. జూలై 17న తన తుది నివేదికను సమర్పించనుంది. దీంతో పాటు వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయసభల్లో వాడి వేడి చర్చ జరగనుంది. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టడం అనేది సరైన పద్ధతి కాదని వాయిదా వేసినట్లు తెలుస్తోంది..

**బిజెపి సంస్థాగత మార్పులు సైతం..**

తాజా పరిస్థితులు బట్టి ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో మెగా క్యాబినెట్ విస్తరణ, బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే ఛాన్స్ కనిపిస్తోంది. ఇటీవల కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణ పై మరింత కసరత్తు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. జూన్ చివరి వారంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రపతి ద్రౌపది మూర్ముతో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఎంబీఏ ప్రభుత్వం మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయం తీసుకోవడం కంటే.. సుదీర్ఘ కసరత్తు చేసి సెప్టెంబర్లో మంత్రివర్గ విస్తరణ చేపట్టాలన్నది ప్రధాని ఆలోచనగా తెలుస్తోంది. సెప్టెంబర్ వేదికగా టీం మోడీ లో భాగంగా భారీ మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయి అనేది ఢిల్లీ వర్గాల అంచనా.

# మూగబోయిన స్వర కోయిల

మండలం పల్లపట్ల వాస్తవ్యురాలైన ఆమె ఆరేళ్లుగా మైసూరు బన్నూరు రోడ్డులోని ఫార్మ్‌హౌజ్‌లో నివాసం ఉంటున్నారు. ఎల్లప్పుడూ ధవళ వర్ణ సంప్రదాయ చీరకట్టులో కనిపించేవారు. కొన్నేళ్లుగా వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఇటీవలే బోగాది నగరలోని ఎస్‌బీఎం లేఔట్ నివాసంలో అద్దెకు ఉంటున్నారు. నవీన్, పవన్ అనే వ్యక్తులు ఆమెకు తోడునీడగా ఉంటూ సేవలు చేస్తూ వచ్చారు. వారం క్రితమే ఆమె మంగళూరుకు తన అక్క ఇంటికి వెళ్లి తిరిగి వచ్చారు. ఈ సమయంలో ఆమెతో పాటు కోడలు ఉమా, మనమరాలు అప్సరా కూడా ఉన్నారు. గత సంవత్సరం ఆమె తన కుమారుడు మురళీకృష్ణను కోల్పోవడంతో తీవ్ర మానసిక కుంగుబాటుకు గురయ్యారు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెంచుకుని మౌనంగా ఉండిపోయారు. ఈ క్రమంలో శనివారం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మధ్యాహ్నం 12.49 గంటలకు మైసూరులోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స అందించారు. అయినా ఆమె మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ (బహుళ అవయవ వైఫల్యం)తో గుండెపోటుకు గురయ్యారు. రాత్రి 7.30 గంటలకు ఆమె మరణించారని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకుని ఆమె బంధువులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఆస్పత్రి వద్దకు భారీగా తరలివచ్చారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం 5 గంటలకు మైసూరు బోగాది సమీపంలోని కణియర హుండి గ్రామంలోని ఫామ్‌హౌజ్‌లో జరుగుతాయని బంధువులు మీడియాకు



తెలిపారు. అంతకు ముందు ఆమె పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మైసూరులోని మహారాజ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఉంచుతారు. ప్రభుత్వ లాంఛనాలతో జానకి అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

**ఆటుపోట్ల జీవితం**

ఎస్.జానకి తన తీయని కంఠం ద్వారా ప్రజలను ఎంతగా ముగ్ధుల్ని చేశారో ఆమె జీవితం అంతగా ఆటుపోట్లకు గురైంది. 1938 ఏప్రిల్ 23న సత్యవతి, శ్రీరామమూర్తి దంపతులకు జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యుడు. ఆరుగురు అక్కాచెల్లెళ్లలో నాలుగో సంతానం జానకి. చదువంటే శ్రద్ధ లేదు. బడి అంటే ఆమడదూరం వెళ్లేవారు. రేడియోలో పాటలు వింటూ కాలక్షేపం. రోడ్డుపైకి వెళ్లినపుడు లతా మంగేష్కర్ పాటలు వింటూ, తాను పాడుతూ పెరిగారు. వివిధ కారణాలరీత్యా శ్రీరామమూర్తి కుటుంబం కొంతకాలం కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో, తర్వాత రాజమండ్రిలో ఉన్నారు. సిరిసిల్లలోనే తన బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తన చిన్నతనంలో తల్లిదండ్రులతో కలిసి ఎండ్ల బండిలో వేములవాడకు వెళ్లి బాలనాగమ్మ సినిమాను చూసి వచ్చినట్లు ఓ ఇంటర్వ్యూలో జానకి గుర్తుచేసుకున్నారు. పాటలపై కూతురుకు గల ఆసక్తిని గమనించిన తల్లి సత్యవతి, రాజమండ్రిలో నాదస్వర విద్వాన్ గాడవల్లి పైడిస్వామి దగ్గర సంగీతంలో ప్రాథమిక శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత ప్రత్యేకంగా శాస్త్రీయ సంగీతం ఎవరి వద్దా నేర్చుకోలేదు. గురువు గారు కీర్తనలతో ఆరంభించినా, జానకి ధ్యాసంతా సినిమా పాటలపైనే ఉండేది. అక్కడుండే 'క్రాంతి కళామండలి యూత్ అసోసియేషన్'లో సినిమా పాటల కచేరీల్లో పాటలు పాడుతున్న కాలంలో, అమ్మ మరణంతో మళ్లీ ఆ కుటుంబం హైదరాబాద్‌కు చేరుకుంది. జానకి మామయ్య 'ఫన్ డాక్టర్'చంద్రశేఖర్ వేదికపై ప్రదర్శనలిస్తుండేవారు. మధ్యమధ్యలో జానకి పాటలు పాడుతూ వచ్చారు. ఆయన కుమారుడు వి.రాంప్రసాద్, జానకి స్వరంలోని ప్రత్యేకతను గమనించారు. కుమారుడు చేసిన సూచనతో చంద్రశేఖర్, చెన్నైలోని రెండు మూడు స్టూడియోలకు జానకి గురించి లేఖ రాశారు. ఏవీఎం స్టూడియో నుంచి ఆడిషన్‌కు రమ్మని కబురొచి?చంది.

# 'కాలే శ్వరం' మార్కు పాలిటిక్స్!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కాలేశ్వరం మోటార్ల చుట్టూ రాజకీయం మొదలైంది. సరికొత్త హైడ్రామా ప్రారంభం అయింది. వర్షాకాలం ప్రారంభమై గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో.. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చుట్టూ మళ్ళీ రాజకీయం వేడెక్కింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంప్ హౌస్ లోని మోటార్లను తక్షణమే ఆన్ చేసి.. ఎగువన ఉన్న రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బృందంతో దండయాత్ర మొదలుపెట్టారు. మేడిగడ్డ పర్యటనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతాంగానికి నిరంధించడమే లక్ష్యంగా భారత్ రాష్ట్ర సమితి ఈ టూర్ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది

**కేటీఆర్ బృందం రెడీ..**

గోదావరి నదిలోకి భారీగా ఇన్ఫ్లో వస్తున్నప్పటికీ.. కెసిఆర్ పై ఉన్న రాజకీయ కక్షతోనే కాలేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. కన్నేపల్లి పంప్ హౌస్ లోని మోటార్లు సురక్షితంగానే ఉన్నాయని.. వాటిని ఆన్ చేసి నీటిని పంపిస్తే ఎండిపోతున్న ఆయకట్టుకు ప్రాణం పోయేవచ్చని బీఆర్ఎస్ వాదిస్తోంది. కెసిఆర్ నిర్మించిన ఈ అద్భుత ప్రాజెక్టును పనికిరానిదిగా చిత్రీకరించేందుకు రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని.. దీనిని ఎండగట్టడానికి తాము క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నట్లు కేటీఆర్ వర్గం చెబుతోంది.

**తిప్పి కొడుతున్న రేవంత్ సర్కార్..**

రేవంత్ సర్కార్ ఈ ఆరోపణలను గట్టిగానే తిప్పికొడుతోంది. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్ల వల్ల ప్రస్తుతం అక్కడ నీటి నిల్వ ఉంచడం ప్రమాదకరమని.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం జూన్ 2027 నాటికి మాత్రమే పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని స్పష్టం చేస్తోంది. కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారహితమని... కనీస స్పృహ లేకుండా ఉన్నాయని కొట్టిపారేస్తున్నారు. గత ప్రభుత్వ తప్పుడు డిజైన్ల వల్లే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయని చెబుతున్నారు. ప్రస్తుతం సెంట్రల్ వాటర్ కమిషన్, ఎన్ డి ఎస్ ఏ నిపుణుల ఆధ్వర్యంలో 13 రకాల కీలక సేఫ్టీ టెస్టులు నడుస్తున్నాయి. ఇలాంటి సాంకేతిక పరీక్షల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా మోటార్లు ఆన్ చేసి నిల్వ చేస్తే.. దాదాపు 50 గ్రామాల వరకు ముంపునకు గురవుతాయని.. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయం చేయాలని చూస్తే సహించేది లేదు అని కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టు మళ్ళీ ఆ ఉభయ పార్టీల మధ్య పొలిటికల్ వార్ గా మారుతుంది. భారత్ రాష్ట్ర సమితి తన ఉనికి చాటుకోవడానికి... కెసిఆర్ మార్పు ప్రాజెక్టును డిపెండ్ చేసుకోవడానికి చలో మేడిగడ్డ అస్త్రాన్ని ప్రయోగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సాంకేతిక భద్రత నివేదికలు ముందుకు తెచ్చి గులాబీ పార్టీ హయాంలో అవినీతిని ఎండగట్టే ప్రయత్నం చేస్తోంది.

## పరిశోధనలు,ఆవిష్కరణలు, స్టార్టప్‌లపై దృష్టి

### యువతకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు

**గురజాడ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పట్టాలు పంపిణీ**

విశాఖపట్టణం: యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఏయూ కన్వెన్షన్ హాల్లో జేఎన్టీయూ గురజాడ విశ్విద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ నజీర్, వీసీ వీవీ.సుబ్బారావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, వివిధ యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనా యుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హాజం౯య్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని గవర్నర్ వ్యాఖ్యానించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించు కోవాలని దిశానిర్దేశర చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని మార్గనిర్దే శర చేశారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, విద్యాసంస్థలదే కీలక పాత్ర అని తెలిపారు. జేఎన్‌టీయూ జేవీ క్యాంపస్‌లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

# మధ్యతరగతి 'భాగ్యనగరం'!

(మొదటి పేజీ తరువాయి)

మినీ ఇండియా అని కూడా పిలుస్తారు. మెట్రో నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది. ప్రపంచ స్థాయి దిగ్గజ ఐటీ సంస్థలు ఉన్నాయి. ఫార్మసీ రంగంలో కూడా కీలక స్థానంలో ఉంది. అనేక కంపెనీలు ఎక్కడ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి మధ్యతరగతి కుటుంబాల వారు ఉపాధిని వెతుక్కుంటూ భాగ్యనగర బాటపడుతుంటారు.

**కుటుంబాలతో సహా..**

కుటుంబాలతో సహా భాగ్యనగరం ఉపాధి కోసం వచ్చిన వారు అనేకం. అటువంటి వారితోనే శివారు ప్రాంతాలు విస్తరించాయి. ప్రత్యేక కాలనీలు ఏర్పడ్డాయి. అందుకే మధ్యతరగతి వారి జీవన విధానానికి చాలా దగ్గరగా ఉంటుంది హైదరాబాద్. ఎలాంటి వారు అయినా కుటుంబంతో సహా హైదరాబాద్ వస్తే ఉపాధి పొందుతారు అనేది ఒక మాట. అంతలా ఉంటాయి ఇక్కడ ఉపాధి మార్గాలు. కంపెనీల్లో ఉద్యోగాలతో పాటు మహిళలు పని చేసుకునేందుకు వీలుగా చాలా రకాల అవకాశాలు ఉంటాయి. దంపతులిద్దరూ కంపెనీలో పని చేస్తూ.. స్థానికంగా పిల్లలను చదువుకు పంపుతూ ఉంటారు. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి అయితే కుటుంబాలతో సహా వలస వస్తుంటారు. శ్రీకాకుళం జిల్లా లాంటి ప్రాంతాల్లో తమ సొంత గ్రామంలో ఇళ్లకు తాళాలు వేసి భాగ్య నగరానికి వచ్చిన వారు ఉన్నారు. అయితే తాజా నివేదికలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎక్కువగా ఉన్న నగరంగా హైదరాబాద్ గుర్తింపు దక్కించుకోవడం విశేషం.

# వైటీడీఏ నా శాఖ పరిధిలో ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈబోర్డు సభ్యుల నియామకంలో తాను ఎవరినీ సంప్రదించలేదన్న ఆరోపణల్లో పస లేదని, తన శాఖ పరిధిలోకి వస్తుంది కనుకనే దేవాలయానికి అవసరమైతే ఓ పది కోట్లు విరాళంగా ఇవ్వగలిగిన వారిని చూసి సభ్యులుగా నియమించామని చెప్పా రు. ఈ బోర్డులో నల్లగొండ జిల్లా వారే ఉండాలన్న నిబంధన లేదని, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో అనేక రాష్ట్రాల సభ్యులుంటారని ఆయన గుర్తు చేశారు. శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం అనంతరం బోధ్ పెవిలియన్‌లో ఆయన విలేకరుల తో ఇష్టాగోష్టి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2029 ఎన్నికలలోపు నియోజకవర్గాల పునరి?వభజన జరుగుతుందని, మహిళా బిల్లు ఆమోదం పొందుతుందని, జమిలి ఎన్నికలు కచ్చితంగా వస్తాయని చెప్పారు. అసలు ఏ నియోజకవర్గాన్ని ఎలా విభజిస్తారో, ఏ నియోజకవర్గం ఎవరికి రిజర్వు అవుతుందో తెలియనప్పుడు తాడూ లేదు బొంగరం లేదన్నట్టు ఇప్పుడు సర్వేలు ఎందుకు చేయిస్తామని ప్రశ్నించారు. ఎవరికి ఏ స్థానం రిజర్వు అయినా తన కుటుంబంలో తాను ఒక్కడినే రాజకీయాల్లో ఉంటానని, అందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. తాను పూరీలు చేసిన వీడియో వైరల్ అయిందన్న విషయం విలేకరులు తన దృష్టికి తీసుకురాగా, తన మనుమడు పూరీలు చేయమని అడిగితే చేశానని చెప్పారు. తాను ముఖ్యమంత్రిని అయ్యాక గతంలో ఉన్న ఏ పథకాన్ని కూడా నిలిపివేయలేదని, అన్ని పథకాలు కొనసాగిస్తున్నానని చెప్పారు.

**క్యాంపు ఆఫీసును విలేకరులకు చూపించిన సీఎం**

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) చైర్మన్‌గా తన క్యాంపు ఆఫీసు ఇక్కడ పెట్టుకునే అధికారం ముఖ్యమంత్రికి ఉంటుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. తాను అధికారిక నివాసంలో ఉండటం లేదు కనుక కొన్ని స్వతంత్ర వ్యవస్థలకు చెందిన వారు అక్కడకు రావడం సరికాదని, అందుకే ఇక్కడ క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేసుకున్నానని చెప్పారు. తన క్యాంపు ఆఫీసుకోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టానడడంలో వాస్తవం లేదని చెప్పిన రేవంత్‌రెడ్డి బోధ్ పెవిలియన్‌ను విలేకరులకు చూయించారు. అక్కడ సీఎం కార్యాలయం, కాన్ఫరెన్స్ హాల్, లాన్‌తోపాటు లోయర్ గార్డెన్‌తో సహా విలేకరులకు చూపించారు. చిన్న కార్యాలయంలో పనిచేస్తున్నానని, అందరికీ అందుబాటులో ఉండేలా ఇక్కడ అధికారిక సమీక్షలు చేస్తున్నానని రేవంత్ చెప్పారు.

# ఎన్నికల బరిలో ప్రశాంత్ కిషోర్!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇప్పుడు మరోసారి ఎన్నికల బరిలోకి దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు ప్రశాంత్ కిషోర్. బీహార్ లోని బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉప ఎన్నికల్లో తన జన సూరజ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. గత ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీ చేసి.. కనీసం ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. కేవలం మూడు శాతం ఓట్లతో సరిపెట్టుకున్నారు. ఇప్పుడు బిజెపికి కంచుకోట లాంటి రాజధాని పాట్నా నడిబొడ్డున ఉన్న స్థానాన్ని ఎంచుకోవడం ప్రశాంత్ కిషోర్ అతిపెద్ద సాహసమే.

**తెర వెనుక వ్యూహాలతో..**

గత ఎన్నికల్లో తన జన సూరజ్ పార్టీని రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేయించారు ప్రశాంత్ కిషోర్. తాను మాత్రం ఎక్కడా పోటీ చేయలేదు. తెర వెనుక వ్యూహాలకే పరిమితం అయ్యారు. ఇప్పుడు ఉప ఎన్నికల బరిలోకి స్వయంగా ఆయనే పార్టీ అభ్యర్థిగా దిగుతుండడం నిజంగా గొప్ప పరిణామం. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. జన సురజ్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి తరుణంలో పార్టీకి మళ్ళీ ఊపిరి పోయాలని అనుకోవడం సాహసమే. సురక్షితమైన స్థానాల కోసం వెతకడం కంటే.. బలమైన ప్రత్యర్థిని వారి సొంత గడ్డపై డీ కొట్టడమే సరైన మార్గమని ప్రశాంత్ కిషోర్ భావించారు.

**ఆ లక్ష్యంతోనే..**

ఎప్పటికైనా బీహార్లో నెగ్గుకు రావడమే తన లక్ష్యం అన్నట్టు కొనసాగుతున్నారు ప్రశాంత్ కిషోర్. ఈ ఉప ఎన్నికను సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ పనితీరుపై ఒక రెఫరండం గా క్రియేట్ చేస్తున్నారు ప్రశాంత్ కిషోర్. బంకి పూర్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. 1995 నుంచి ఇక్కడ బిజెపి జండా ఎగురుతూ వస్తోంది. ఈ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచారు సీనియర్ నేత నితిన్ నబీన్. అయితే ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో.. ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. గత ఎన్నికల్లోను నితిన్ నబీన్ తన సమీప ఆర్జేడి అభ్యర్థిపై ఏకంగా 50 వేలకు పైగా ఓట్లతో గెలిచారు. బీహార్ లోనే అత్యంత ధనిక, అత్యధిక విద్యావంతులు ఉన్న పట్టణ ఓటర్ల పరిధిలో ఉంటుంది ఈ నియోజకవర్గం. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ నెట్వర్క్ తో పాటు బిజెపి క్యాడర్ బలంగా పనిచేస్తుంది ఈ నియోజకవర్గంలో.

**అంత సులువు కాదు...**

బిజెపికి బలమైన నియోజకవర్గంలో ప్రశాంత్ కిషోర్ గెలుపు అంత ఈజీ కాదు. మరోవైపు ఆర్జెడితోపాటు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకు కూడా ఉంది. అయితే మూడు ప్రధాన పార్టీల మధ్య ఓటు చీలి.. తాను ప్రత్యేక చొరవతో ముందుకు వెళితే బంకిపూర్ ప్రజలు తనను ఆదరిస్తారని భావిస్తున్నారు ప్రశాంత్ కిషోర్. అసెంబ్లీలో బలమైన గళం వినిపిస్తానని.. తనకు ఒక అవకాశం కల్పించాలని కోరితే కచ్చితంగా ప్రజలు నమ్ముతారని ఆయన భావిస్తున్నారు. అందుకే బలంగా ప్రజల్లోకి వెళ్లాలని ఒక నిర్ణయానికి వచ్చారు. ఒకవేళ అనుకున్నది సాధిస్తే ప్రశాంత్ కిషోర్ అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయం. లేకుంటే మాత్రం జాతీయస్థాయిలో మరోసారి పలుచన కావడం అనివార్యం అనిపిస్తోంది.

## సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు

### పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

భీమవరం: సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు జరపడానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురంలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే నాయకర్, ప్రజాప్రతినిధులు,అధికారులు ఉన్నారు. అనంతరం నర్సాపురం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వ్యాఖ్యానించారు. గోదావరి పుష్కరాలకు సుమారుగా 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. గత పుష్కరాలకు నాలుగు కోట్ల మంది భక్తులు వచ్చారని పేర్కొన్నారు. ఇప్పటివరకు మున్సిపల్ శాఖకు పుష్కర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.150 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో శాఖల వారీగా పుష్కర నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.

# తమిళనాడులో రాజ్యాంగ వివాదం!

(మొదటి పేజీ తరువాయి)

బోర్డులు, కార్పొరేషన్ల చైర్మన్లను తొలగించే క్రమంలో.. ఏకంగా ఎన్నికల కమిషనర్ను కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి తేవడంపై తమిళ రాజకీయ, ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేగుతోంది.

**సీనియర్ అధికారిణి..**

జ్యోతి నిర్మల సామి రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి. 2024లో ఐదేళ్ల కాల పరిమితితో తమిళనాడు ఎన్నికల కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు. ఆమె పదవీకాలం 2029 మే వరకు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం వార్డుల పునర్విభజన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న తమిళనాడు డి లిమిటేషన్ కమిషన్ చైర్పర్సన్ గా కూడా ఉన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ఈమె నేతృత్వంలో ఈవీఎంల ఏర్పాటు ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ సమయంలో విజయ్ సర్కార్ ఆమెను రాజీనామా చేయాలని ప్రతిపాదించడం చర్చనీయాంసంగా మారింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తును పూర్తి చేయాలనే పట్టుదలతో ఆమె ఉన్నారు.

**అంత ఈజీ కాదు..**



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ను అంత సులువుగా తొలగించలేరు అనేది విశ్లేషకుల మాట. రాజ్యాంగ నిపుణులు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు ఈ నిర్ణయం పై. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ను గవర్నర్ నియమించినప్పటికీ.. వారిని తొలగించడం మాత్రం అంత సులువు కాదు. హైకోర్టు న్యాయమూర్తిని ఏ విధంగానైతే తొలగిస్తారో.. అదే పద్ధతిని అనుసరించాల్సి ఉంటుంది. సాధారణ ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల అధిపతులను మార్చినట్టుగా.. ఒక రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అధిపతిని మార్చడం చట్ట విరుద్ధమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గతంలో డీఎంకే హయాంలో నియమితులైన మాజీ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా డీఎంకే అధికారం కోల్పోయిన వెంటనే తమ పదవులను వదులుకున్నారు కానీ... రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విషయంలో మాత్రం అది జరగదు. జ్యోతి నిర్మల సామి చాలా సిన్సియర్ అధికారిగా మంచి పేరు ఉంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటారన్న పేరు కూడా ఆమె సొంతం. 2008లో కన్యాకుమారి జిల్లాలో ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకున్నందుకుగాను తమిళనాడు ప్రభుత్వం అత్యున్నత కల్పనా చావ్లా శౌర్య పురస్కారం అందుకున్న ఏకైక ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఈ వివాదంపై ప్రతిపక్ష డిఎంకె, ఇతర పార్టీలు విజయ్ ప్రభుత్వం పై మండిపడుతున్నాయి. స్వయం ప్రతిపత్తి గల సమస్యలను విజయ్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట నెలకొన్న ఈ హైడ్రామా.. రాబోయే రోజుల్లో ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో చూడాలి.

# షాబాద్ హంతకుడికి... సీఎం రేవంత్‌కు తేడా లేదు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో పోక్సో కేసు నిందితుడు ముగ్గురు పసిపిల్లలతో సహా ఆరుగురిని కిరాతకంగా చంపేయడం ప్రభుత్వ, పోలీసుల వైఫల్యమేనని బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం 'ఎక్స్'లోనూ కొన్ని వ్యాఖ్యలు పోస్ట్‌చేశారు. 'రేవంత్‌కు షాబాద్ హంతకుడికి తేడా లేదు. రైతులు సాగునీరు అడిగితే ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలని మాట్లాడిన ముఖ్యమంత్రి వెంటనే ప్రజలకు, రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి'అని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. పోలీసుల నిర్లక్ష్యంతో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు మరోసారి దారుణ హత్యాకాండకు పాల్పడ్డాడన్నారు. మే 16న మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే.. నిందితుడిని అరెస్ట్ చేయడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. అవినీతికి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన పోలీసులు.. నెల రోజులపాటు అతన్ని అరెస్ట్ చేయకుండా వదిలేయడంతో.. అతను కోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకుని ఈరోజు ఆ



కుటుంబాన్నే అంతం చేశాడని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలు బయటపడినప్పుడల్లా ప్రజల దృష్టి మళ్లించేందుకు కాళేశ్వరం పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని ఆరోపించారు.

**చిన్నారి పేరుపై కోటి డిపాజిట్ చేయాలి**

'రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించింది. పోలీస్ స్టేషన్లను ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టడానికి, ల్యాండ్ సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మార్చేశారు. షాబాద్ ఘటనలో ప్రాణహాని ఉంది, రక్షణ కల్పించండని బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి మొత్తుకున్నా పట్టించుకోలేదు. ఈ కిరాతక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబంలో మిగిలిన దివ్యాంగ చిన్నారి పేరు మీద ప్రభుత్వం రూ.కోటి ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ అమ్మాయిని పెంచే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి'అని హరీశ్‌రావు చెప్పారు. ఓదార్పు కోసం వెళ్లిన మాజీ హోంమంత్రి సబిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పద్మలను నేరస్తులుగా అరెస్ట్ చేశారని, అదే హత్య చేసిన నేరస్తున్ని పోలీసులు పట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కొంతకాలం ప్రజలను మోసం చేయవచ్చేమోగానీ, ఎల్లకాలం మోసం చేయడం సాధ్యం కాదన్న అబ్రహం లింకన్ వ్యాఖ్యలు రేవంత్‌కు సరిగ్గా సరిపోతాయని హరీశ్ అన్నారు.

**రేవంత్ తెచ్చిన కృత్రిమ కరువు**

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కృత్రిమ కరువు అని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లున్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. పంట పొలాల్లో గోదావరి నీళ్లు పారేలా రేవంత్‌రెడ్డికి కలలో వచ్చి చెప్పాలని పెద్దమ్మ తల్లిని ప్రార్థించానని చెప్పారు. రిటైర్డ్ ఇంజనీర్లు, బీఆర్ఎస్ నాయకులు సాగునీటి కోసం సూచనలు చేస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం రాజకీయ కక్షలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. తగిన సమయంలో రైతులు, ప్రజలే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు హెచ్చరించారు.

# భారత్ లక్ష్యం యుద్ధం కాదు

## ప్రపంచ శాంతి, స్థిరత్వమే మా విధానం

**భద్రతకు ముప్పు వాటిల్లినందునే ఆపరేషన్ సిందూర్**

**అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం**

**కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ**

విశాఖపట్నం: భారత్ లక్ష్యం యుద్ధం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విధానమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధం కాదని, భారత భద్రతకు ముప్పు వాటిల్లితే దేశం ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి చూపించిన చర్య అని వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని, భారత్ వ్యతిరేక శక్తులకు అవసరమైన సమయంలో తగిన సమాధానం ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరడం దేశ భద్రతకు మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన ఆయన.. ఇది భారత నౌకాదళ శక్తిని మరింత పెంచే కీలక అడుగని పేర్కొన్నారు. భారత సముద్ర భద్రతలో విశాఖపట్నం కీలక కేంద్రంగా ఎదిగిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించామని తెలిపారు. ఐదో తరం ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ టెక్నాలజీతో పాటు అండర్‌వాటర్ టార్పెడో వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును దేశంలో ప్రముఖ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ షిప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, పూర్తి స్థాయి నిఘా వ్యవస్థలతో భారత సాయుధ దళాలను ఆధునీకీకరిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొత్త సాంకేతికత యుద్ధ అవసరాలకే కాకుండా విపత్తుల సమయంలో ఇతర దేశాలకు సహాయం చేయడంలో కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మారిటైమ్ విజన్-2030 అమలులో భాగంగా సముద్ర రంగ అభివృద్ధికి ప్రత్యేక మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. షిప్‌బిల్డింగ్ రంగంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని, భారత్‌ను ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, మెరిటైమ్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ప్రపంచ స్థాయి మెరిటైమ్ ఎకోసిస్టమ్ నిర్మాణం దిశగా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. భవిష్యత్తులో యుద్ధాలు కృత్రిమ మేధతో జరుగుతాయని, కానీ దేశం పట్ల ప్రేమ, సుశిక్షితులైన సైనికులు, సమర్థవంతమైన సైనిక సత్తా ఉంటే యుద్ధాలను గెలవవచ్చు అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత రక్షణ, ఏరోస్పేస్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కొత్త శక్తికేంద్రంగా మారినట్లు ఆయన తెలిపారు.

# ఘజియాబాద్‌లో అమానుష ఘటన

**ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారం.. నిర్మాణంలో ఉన్న భవనంలో శవం లభ్యం**

లక్నో,జులై 11(ఆర్ఎన్ఎ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఏడేళ్ల చిన్నారి మృతదేహం తీవ్ర కలకలం రేపింది. పోస్టుమార్టం నివేదికలో బాలికపై హత్యాచారం జరిగినట్లు నిర్ధారణ కావడంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలోని నంద్‌గ్రామ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత చిన్నారి తల్లిదండ్రులు అదే నిర్మాణ స్థలంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే ఓ గుడిసెలో నివసిస్తున్నారు. చిన్నారి శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న ఆ మాల్ బేస్‌మెంట్‌లో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహంపై తీవ్రగాయాలు ఉండటం, పలు ఎముకలు విరిగిన ఆనవాళ్లు కనిపించడంతో వెంటనే నంద్‌గ్రామ్ పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. చిన్నారిని మాల్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో భాగంగా అనుమానిస్తున్నారు. అయితే ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు ఫోరెన్సిక్ బృందం రంగంలోకి దిగి ఆధారాలు సేకరిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారం, హత్య, అపహరణ, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# షాబాద్ మండలంలో ఉద్రిక్తత

**దైవాలగూడకు వెళుతున్న బిఆర్ఎస్ నేతల అరెస్ట్**

రంగారెడ్డి,జూలై11: పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. షాబాద్ మండలం దైవాలగూడకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని చేవెళ్ల వదద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని శంకర్‌పల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇక పటోళ్ల కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. 2018లో సరిత అనే మహిళను రాజ్‌కుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. అయినప్పటికీ మరో మైనర్ బాలికను ప్రేమ పేరుతో రాజ్‌కుమార్ వేధించసాగాడు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లి ఆమెను కాలేజీకి పంపించకుండా ఇంట్లోనే ఉంచింది. ఈ క్రమంలో ఒకసారి పరీక్షల కోసం బాలిక కాలేజీకి వెళ్లినప్పుడు.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లేందుకు యత్నించాడు. అప్పుడు ఆమె తల్లి చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి నుంచి బాలికను తప్పించింది. అప్పటి నుంచి బాలికపై రాజ్‌కుమార్ పలుమార్లు బెదిరింపులకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మీ నాన్నను ఎలా చంపేశారో.. మిమ్మల్ని కూడా అలాగే చంపేస్తానని బాధితురాలి కుటుంబాన్ని గతంలో బెదిరించాడని అంటున్నారు. అయితే నిందితుడు బహిరంగంగా తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నా.. పోక్సో కేసు నమోదైనప్పటికీ బాలికకు ఎలాంటి రక్షణ కల్పించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఉదందతానికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. గతంలో భూతగాదాలో ఇద్దరిని బెదిరించినందుకు రాజ్‌కుమార్‌పై గతంలోనే రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు సమాచారం. మరోవైపు పోక్సో కేసులో కేవలం ఏడేళ్లు మాత్రమే శిక్షపడేలా తేలికపైన సెక్షన్లను పోలీసులు జత చేయడం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల కేవలం రూ.20వేల పూచీకత్తుతో రెండు నెలల్లోనే బెయిల్ వచ్చిందని.. దీనివల్లే బయటకు వచ్చిన రాజ్‌కుమార్ ఆరుగురిని కిరాతంగా హత్య చేశాడని స్థానికులు మండిపడుతున్నారు.

# వియత్నాం బోటు ప్రమాద ఘటనపై సీఎం తీవ్ర విచారం

**ఇద్దరు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన సిఎం**

**బాధితులకు పూర్తి సహాయం అందించాలని అధికారులకు ఆదేశం**

అమరావతి, జూలై 11: వియత్నాంలో పర్యాటక బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో 19 మంది ప్రమాదం జరిగిన బోటులో ఉన్నారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, మిగిలిన వారిని రక్షించారు. ఒకరు తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. విహార యాత్రకు వెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారు అంతా సురక్షితంగా ఉన్నారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయం, పర్యాటకుల ప్రస్తుత పరిస్థితిపై సిఎం అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన వారిని రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు రాష్ట్ర వాసుల కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన సహాయం చేయాలని సిఎం అధికారులను అదేశించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు... వియత్నాం అధికారులతో, అక్కడ భారత ఎంబసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

# ఘనంగా ఎస్ఎస్ జీ వార్షిక క్రీడల పోటీలు

**ముఖ్య అతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్హా**

అమరావతి, జూలై 11: ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ విభాగంలోని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ వార్షిక క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. మంగళగిరిలోని ఎస్ఎస్ జీ గ్రౌండ్స్ లో నిర్వహించిన ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్హా, ఐజీ పీహెచ్ డీ రామకృష్ణ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డైరెక్టర్ ఏ.జగదీష్, ఎస్పీ చెన్నుపాటి భద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షిక పోటీల్లో 25 క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభించారు. క్రీడల పోటీల్లో ఆరు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎస్. కమలేంద్రరావు ఈ ఏడాది వార్షిక క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని, టీమ్ స్పిరిట్ ను పెంపొందిస్తాయని ఇంటెలిజెన్స్ చీఫ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## గందరగోళంగా సర్ ప్రక్రియ !



సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం

ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# తృప్తి అంటే సోమరితనం కాదు.. పరిపక్వతకు నిదర్శనం!

మనిషి జీవితంలో సుఖశాంతులకు మూలం ఏమిటి? డబ్బు, పేరు, అధికారం, ఆస్తులు వీటన్నింటినీ సాధించిన తర్వాత కూడా చాలామంది మనసులో ఏదో ఒక వెలితి, తెలియని అసంతృప్తి నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. బాహ్య ప్రపంచంలో ఎంతో విజయం సాధించినట్లు కనిపించినా, అంతరంగంలో మాత్రం ఒక రకమైన శూన్యత వారిని వేధిస్తూనే ఉంటుంది. దీనికి కారణం ఒక్కటే అది తృప్తి లేకపోవడం. ఇంకా కావాలి, ఇంకా కావాలి అనే అంతులేని కోరిక మనిషిని ఎప్పటికీ విశ్రాంతి లేకుండా చేస్తుంది. రాత్రింబవళ్లు పరుగులెత్తేలా చేస్తుంది. కానీ ఏ క్షణంలోనైతే మనిషి ఇది నాకు చాలు, ఇది సరిపోతుంది అని మనసారా మనకున్నదానిలో ఎంత గొప్పతనం ఉన్నా అది కనిపించదు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో ఈ పోలికల సంస్కృతి మరింత తీవ్రమైంది. ఇతరుల కృత్రిమ విజయాలు, సంతోషాలను కేవలం తెరపై చూస్తూ, మన వాస్తవ జీవితంలోని లోటుపాట్లను మాత్రమే చూసుకుంటూ కుంగిపోతున్నాం. కానీ నిజం ఏమిటంటే, ప్రతి ఒక్కరి జీవితంలోనూ బయటికి కనిపించని కష్టాలు, సవాళ్లు, అంతర్గత పోరాటాలు ఎన్నో ఉంటాయి. ఇతరుల మెరుగైన బాహ్య కోణాన్ని మన అంతర్గత లోటుతో పోల్చుకోవడం అన్యాయమే కాదు, ముమ్మాటికీ అవివేకం. కేవలం తృప్తి కలిగిన నిశ్చలమైన మనసు మాత్రమే ఈ విషపూరిత పోలికల వలయం నుండి బయటపడగలదు.ప్రాచీన భారతీయ కలిగి ఉన్నా, మానసికంగా అత్యంత ధనవంతుడు. అతని మనసులో ఇతరులపై అసూయ ఉండదు, రేపటి గురించిన అనవసర భయం ఉండదు, హృదయంలో ఎటువంటి అలజడి ఉండదు. అతను నిద్రపోతే హాయిగా నిద్రపోతాడు, ఇతరులతో మాట్లాడితే ప్రశాంతంగా మాట్లాడుతాడు, సమాజంలో వ్యవహరిస్తే దయతో, కరుణతో వ్యవహరిస్తాడు. ఇదే తృప్తి మానవాళికి ఇచ్చే అసలైన శాశ్వత సంపద ఈ సంపదను దొంగలు దోచుకోలేరు. అందుకే మన పెద్దలు తృప్తియే పరమ సుఖం అని స్పష్టంగా చెప్పారు.తృప్తిని జీవితంలో ఎలా సాధించాలి? జీవితంలో తృప్తిని సాధించడం అంత సులభం కాదు, కానీ అది అసాధ్యమేమీ కాదు. ప్రతిరోజూ ఉదయం

అనగలుగుతాడో, ఆ క్షణంలోనే నిజమైన ప్రశాంతత మొదలవుతుంది. అదే తృప్తి యొక్క గొప్పతనం. మానవ మనస్తత్వం ప్రకారం కోరికలు అనంతమైనవి. ఒక కోరిక తీరగానే, దాని స్థానంలో మరో కొత్త కోరిక పుడుతుంది. చిన్న ఇల్లు ఉన్నవాడికి పెద్ద ఇల్లు కావాలనిపిస్తుంది, పెద్ద ఇల్లు ఉన్నవాడికి మరింత పెద్దది కావాలనిపిస్తుంది. సైకిల్ ఉన్నవాడికి స్కూటర్ కావాలి, బైక్ ఉన్నవాడికి కారు కావాలి, కారు ఉన్నవాడికి ఖరీదైన కారు కావాలి. ఈ పరుగు ఎక్కడా ఆగదు. కోరికలను వెంబడిస్తూ జీవితమంతా గడిపేస్తే, చివరికి వృద్ధాప్యంలో మిగిలేది తీవ్రమైన అలసట, మానసిక ఒత్తిడి, నిరాశ, అసంతృప్తి మాత్రమే. అందుకే పెద్దలు చెప్పారు అవసరాలు తీర్చుకోవడం వేరు, కోరికలను తీర్చుకోవడం వేరు. అవసరాలకు ఒక నిర్దిష్టమైన హద్దు ఉంటుంది, కానీ కోరికలకు ఎటువంటి హద్దు ఉండదు. ఈ తేడాను గుర్తించినవాడే నిజమైన జ్ఞాని. చాలామంది తృప్తి అనే భావనను సోమరితనంతో, పురోగతి లేమితో తప్పుగా పోల్చుతుంటారు. జీవితంలో తృప్తిగా ఉండిపోతే ఇక ఎదగలేము, కష్టపడకుండా ఎదుగుదల ఎలా సాధ్యం? అని వారు ప్రశ్నిస్తారు. కానీ ఇది పూర్తిగా తప్పుడు అవగాహన. తృప్తి అంటే ప్రయత్నం మానేయడం కాదు, చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. సాధించిన దానికి కృతజ్ఞతతో ఉంటూ, మరింత మెరుగ్గా జీవించే దిశగా ప్రశాంతమైన మనసుతో అడుగులు వేయడం. కష్టపడి పనిచేయడం, ఉన్నతమైన లక్ష్యాల కోసం శ్రమించడం ఏమాత్రం తప్పు కాదు. తప్పు ఎక్కడ జరుగుతుందంటే, ఎంత సాధించినా మనసులో శాంతి లేకపోవడం, ఎప్పుడూ ఇతరుల జీవితాలతో మనల్ని పోల్చుకుంటూ లోలోపల కుమిలిపోవడం. తృప్తి కలిగిన వ్యక్తి కూడా ఎంతో కష్టపడతాడు, ఎదగడానికి నిరంతరం ప్రయత్నిస్తాడు కానీ అతని ప్రయత్నం భయం లేదా అత్యాశ నుండి కాదు, పనిపై ఉన్న ప్రేమ నుండి పుడుతుంది. అందుకే ఫలితం ఎలా ఉన్నా అతని మనసు కుదుటపడి ఉంటుంది. నేటి సమాజంలో మనుషులలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రధాన కారణం ఇతరులతో పోల్చుకోవడం. పక్కింటివారి ఇల్లు, స్నేహితుడి భారీ జీతం, బంధువుల పిల్లల విజయాలు వీటితో మన జీవితాన్ని పోల్చుకోవడం మొదలుపెడితే,



జీవన దృక్పథం ప్రకారం, సంతోషం అనేది బాహ్య పరిస్థితులపై లేదా భౌతిక సంపదపై కాకుండా పూర్తిగా మనస్సు యొక్క అంతర్గత స్థితిపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి ఎంత డబ్బు సంపాదించినా, అతని మనసు తృప్తిగా లేకపోతే ఆ సంపద అంతా నిరుపయోగమే అవుతుంది. దీనికి విరుద్ధంగా, సమాజంలో చాలా తక్కువ వనరులు కలిగి ఉన్నప్పటికీ, మనసు తృప్తిగా ఉంటే అదే నిజమైన ఐశ్వర్యం. చేతిలో ఉన్న సాధారణ అన్నం తినేటప్పుడు కృతజ్ఞతతో తినేవాడు, తలదాచుకోవడానికి ఒక చిన్న ఇల్లు ఉన్నా సంతోషంగా బతికేవాడు, తనకున్న ఆత్మీయులతో ప్రేమగా సమయాన్ని గడిపేవాడు వీరే ఈ సృష్టిలో నిజమైన సంపన్నులు. ఎందుకంటే వారి మనసు ఎల్లప్పుడూ శాంతిగా ఉంటుంది, రాత్రి నిద్ర ప్రశాంతంగా పడుతుంది, వారి అనుదిన జీవితం ఎంతో తేలికగా సాగుతుంది.తృప్తి నిజమైన సంపద ఎందుకు? డబ్బు, ఆస్తులు, విలాసాలు తాత్కాలిక శారీరక సుఖాన్ని ఇవ్వగలవు గానీ శాశ్వతమైన మానసిక శాంతిని ఎప్పటికీ ఇవ్వలేవు. ఎంత సంపాదించినా, ఒకవేళ మనసులో తృప్తి లేకపోతే, ఆ వ్యక్తి లోలోపల నిరుపేదవాడే అవుతాడు. దీనికి భిన్నంగా, తృప్తి కలిగిన మనిషి ఆర్థికంగా తక్కువ మనకున్న దానికి కృతజ్ఞత చెప్పుకోవడం మొదటి అడుగు కావాలి. ఎంత చిన్నదైనా సరే, మనం సాధించినదాన్ని గుర్తించి మనసారా సంతోషపడటం నేర్చుకోవాలి. ఇతరులతో మనల్ని మనం పోల్చుకోవడం పూర్తిగా మానేసి, నిన్నటి మన స్థితి కంటే ఈరోజు మెరుగ్గా ఎదగడంపై మాత్రమే దృష్టి పెట్టాలి. అవసరాలు, విలాసవంతమైన కోరికల మధ్య ఉన్న తేడాను గుర్తించి, అనవసరమైన భౌతిక కోరికలను నియంత్రించుకోవాలి. రోజువారీ ధ్యానం కూడా మనసుకు స్థిరత్వాన్ని, నిశ్చలమైన తృప్తిని అందిస్తాయి. జీవితంలోని చిన్న చిన్న సంతోషాలను కుటుంబంతో గడిపే అమూల్యమైన సమయం, ప్రకృతి అందాలు, పాత స్నేహితుల నవ్వులు వీటిని మనసారా ఆస్వాదించడం నేర్చుకోవాలి.మానవ జీవితంలో ఎంత సంపాదించినా, ఎంతటి ఉన్నత పదవులు అధిరోహించినా, ఇది నాకు సరిపోతుంది అని అంతరాత్మ నుండి అనుకోగలిగే మహోన్నత స్థితినే తృప్తి అంటారు. ఇది నిష్క్రియత కాదు, ఇది నిజమైన ఆత్మజ్ఞానం. ఇది వెనుకబాటుతనం కాదు, ఇది మానసిక పరిపక్వత. తృప్తి కలిగిన మనిషి మాత్రమే సమాజంలో నిజమైన శాంతిని అనుభవించగలడు, తన చుట్టూ ఉన్న ఇతరులకు కూడా ఆ శాంతిని, సంతోషాన్ని పంచగలడు. కాబట్టి, డబ్బు వెంట నిరంతరం పరుగెత్తే ముందు, తాత్కాలిక పేరు ప్రతిష్ఠల కోసం తపించే ముందు, ఒక్కసారి ఆగి, మనలో మనం నాకు నిజంగా ఏది ముఖ్యం? నాకు ఇది సరిపోతుందా? అని ప్రశ్నించుకుందాం. ఆ అంతర్గత ప్రశ్నకు హృదయం నుండి నిజాయితీగా అవును అని సమాధానం చెప్పగలిగిన రోజే, మనం ఈ ప్రపంచంలోనే నిజమైన అత్యంత సంపన్నులమవుతాము. తృప్తియే మానవ జీవన సారాంశం, తృప్తియే అంతిమ సుఖం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


## నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

**వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి**

**ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం**

**సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను**

**సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు**



అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు.యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

## ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

**మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత**

**అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్**

అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ – 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

# గో సంరక్షణ ప్రతి హిందువు బాధ్యత

## పుట్టినరోజు సందర్భంగా గోశాలకు ఆర్థిక సహాయం అందించిన బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్



**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** గో సంతతి అభివృద్ధి, గో సంరక్షణకు ప్రతి హిందువు తనవంతు బాధ్యతగా కృషి చేయాలని, లేకపోతే భవిష్యత్తులో మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఏర్పడతాయని తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్) అన్నారు. శనివారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ విఠలేశ్వర ఆలయం ఆవరణలో ఉన్న గోవులకు దాణా అందించడంతో పాటు గో సంరక్షకుడు బుచ్చప్పకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోమాత ముక్కోటి దేవతలకు నిలయమని, హిందూ సంప్రదాయంలో గోమాతకు అత్యున్నత స్థానం ఉందన్నారు. గతంలో ప్రతి ఇంట్లో గోవులు ఉండేవని, కానీ నేడు గ్రామమంతా వెతికినా కొద్ది గోవులు మాత్రమే కనిపిస్తున్న పరిస్థితి బాధాకరమన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకునే వారు గోవుల చిత్రాలతో గృహప్రవేశం చేయడం కంటే, నిజమైన గోమాతను ఇంటికి తీసుకువచ్చి గోపూజ చేయడం ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ సమయంలో జరిగే అనేక దోషాలు, ప్రతికూల ప్రభావాలు గోమాత ప్రవేశంతో తొలగిపోతాయని మన పెద్దలు చెప్పిన సనాతన సంప్రదాయాన్ని నేటి తరం మరచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక జీవనశైలిలో సనాతన విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గో సంరక్షణ, గో సంతతి అభివృద్ధికి ప్రతి హిందూ కుటుంబం తనవంతు సహకారం అందించాలని, గోశాలలను ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారానే పుట్టినరోజులు సార్థకమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షకుడు బుచ్చప్ప, నోముల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీలో ఎన్నికైన జర్నలిస్టులకు ఘన సన్మానం

### ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో అభినందన సభ

### జర్నలిస్టుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని నూతన కమిటీ హామీ



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 11:** టీయూడబ్ల్యూజే-ఐజెయు సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు రామచంద్రపురంలోని బాలాజీ గార్డెన్స్‌లో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టు ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జర్నలిస్టు సంఘ ఐక్యతను ప్రతిబింబిస్తూ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే-ఐజెయు రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులను అభినందించారు. సంఘ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని, జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. జర్నలిస్టుల వృత్తి హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో సంఘం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జనరల్ సెక్రటరీ భశ్వేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఈసీ సభ్యుడు మజీద్ అలీలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సభలో పాల్గొన్న నాయకులు మరియు సభ్యులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానితులు మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి మరియు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సాధన, వృత్తి గౌరవ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే-ఐజెయు అండగా నిలుస్తుందని, సభ్యుల సహకారంతో సంగారెడ్డి జిల్లా కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాన్ని విజయవతంగా నిర్వహించిన ప్రభాకర్ యాదవ్‌కు, ముఖ్య అతిథిగా హాజరైన అబ్దుల్ బాసిత్‌కు, అలాగే హాజరైన జర్నలిస్టులు, సంఘ సభ్యులందరికీ సన్మానితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజెయు నాయకులు, సభ్యులు, పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు

### తెలిపిన జేరిపోతుల జహంగీర్, జాలిగం శ్రీకాంత్ లు



**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన జేరిపోతుల జహంగీర్, జాలిగం శ్రీకాంత్, తదితరులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కుపల్లి నర్సింహులు ఆలేరు నియోజకవర్గం నుండి 5 సార్లు (1983, 1985, 1989, 1994, 1999) తుంగతుర్తి నియోజకవర్గం నుండి 1 సారి (2009) గెలుపొందారు. వారు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా దశాబ్దాల పాటు నిరంతరం ప్రజాసేవలోనే గడుపుతూ, ప్రజాదరణే శ్వాసగా బతికిన ప్రజా నాయకుడు. మాజీ మంత్రి,పెద్దలు మోత్కుపల్లి నరసింహులు నాయకత్వంలో మీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజలపై మీకున్న నిరుపమానమైన ప్రేమ మరిన్ని తరాలకు ఆదర్శం కావాలని ఆశిస్తూ... మీరు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజీ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

### రాష్ట్రప్రధాన కార్యదర్శిగా దుబాకుల శ్రీనివాస్

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా నుండి ఎన్నిక కావడం హర్షం.రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన దుబాకుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .హైదరాబాదులోని సుల్తాన్ బజార్లో జరిగిన రాష్ట్ర కార్యాలయంలో పూర్వ ప్రధాన కార్యదర్శి లింగన్న రాజీనామా వలన వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య తాళ్లూరి వేణు ఈరోజు ఖమ్మం లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీకి ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే హెల్త్ కార్డులు ఇవ్వాలని అదేవిధంగా పేరు రివిజన్ కమిటీ ప్రయోజనాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని రాష్ట్రంలోని 33 జిల్లాలలోని పెన్షనర్ల సమస్యల పట్ల చిత్తశుద్ధిగా పనిచేసే సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని పూర్ణచందర్రావు ఆర్థిక కార్యదర్శి ఆర్ వెంకట్ నారాయణ జిల్లా కార్యదర్శి టి జనార్దన్ ఖాజా మైనుద్దీన్ నగర శాఖ నాయకులు సత్యనారాయణ వెంకటేశ్వర్లు, రమణ యాదవ్ ఆంజనేయులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.






# మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసిన చేనేత సంఘం నూతన కమిటీ...

**దేవరకొండ టౌన్ జులై 11 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** దేవరకొండ నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం నూతన కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ని , మరియు శ్రీశైలం బోర్డు డైరెక్టర్ చిలువేరు కాశీనాథ్ ని కలిసి సన్మానించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు బాలరాజు ఉపాధ్యక్షుడు స్వామి నందీశ్వర్ ప్రధాన కార్యదర్శి పున్న గోవర్ధన్ కోశాధికారి వనంశ్రీనివాసులు డైరెక్టర్లు గుర్రం జయలక్ష్మి పగిడిమర్రి శ్రీనివాసులు మరియు పగిడిమర్రి రఘురాములు . చిట్టిపోలు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మహాదేవ్‌పూర్ విద్యార్థుల ఎంపిక

### జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని కోచ్ సయ్యద్ నయ్యర్ అలీ ఆకాంక్ష



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 12న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మహాదేవ్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జె. చిరంజీవి, బి. వినయ్ కుమార్, కె. అంజిబాబు, వి. రణధీర్, కె. నిరంజన్ పాల్గొననున్నారు. గత మే నెలలో భూపాలపల్లి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో ఈ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. వారి ప్రతిభను గుర్తించిన అధికారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని అథ్లెటిక్ కోచ్ సయ్యద్ నయ్యర్ అలీ ఆకాంక్షించారు. క్రమశిక్షణతో సాధన చేస్తే మరిన్ని విజయాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. పాఠశాల పేరు, జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచేలా పోటీల్లో ప్రతిభ కనబరచాలని వారికి ప్రోత్సాహం అందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు మహాదేవ్‌పూర్ విద్యార్థులు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ముందుకు సాగి రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. ఈ విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఇందిరా నగర్ అంగన్వాడీ సెంటర్లో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం



**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజున మండల కేంద్రంలోని ఇందిరా నగర్ అంగన్వాడి సెంటర్లో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. చిన్నపిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎ మేల్ సిహెచ్ సత్యానందం ఎంపీహెచ్ఎ ఎఫ్ పి. మమత,ఆశావర్కర్లు కె. భాగ్యమ్మ,కె.పద్మ,ఏడబ్ల్యుసి టీచర్ వి.నాగమ్మ,నీడ్ ఎన్జీవో అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం, గర్భిణీ స్త్రీలు,బాలింతలు,పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణతోనే ఆరోగ్యవంతమైన కుటుంబం

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ




**మంచిర్యాల, జూలై 11(క్రైమ్ మిర్రర్):** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి శనివారం జనాభా నియంత్రణ, కుటుంబ సంక్షేమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అరుణశ్రీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఆసుపత్రి సంచాలకుడు డాక్టర్ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 11 నుంచి 18 వరకు కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. "పిల్లల మధ్య సరైన అంతరం.. కుటుంబానికి ఆరోగ్య భద్రత" అనే నినాదంతో అర్హులైన దంపతులకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తూ తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న కుటుంబ నియంత్రణ సేవల్లో మహిళలకు మాల-ఎన్, ఛాయ మాత్రలు, అత్యవసర గర్భనిరోధక మాత్రలు (ఈ-పిల్స్), ఐయూసీడీ, అంతరా ఇంజెక్షన్ వంటి తాత్కాలిక పద్ధతులు, పురుషులకు నో-స్కాల్పెల్ వ్యాసెక్టమీ (ఎన్ఎస్వీ) వంటి శాశ్వత కుటుంబ నియంత్రణ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దేశంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో "చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం" అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమాచారాన్ని ప్రదర్శించాలని జిల్లా వైద్యాధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, మాస్ మీడియా బృందం సభ్యులు అల్లాడి శ్రీనివాస్, ఎం.డి. రషీద్, సీహెచ్‌వోలు నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, పుట్ట సత్తయ్య, ఆర్.ఎస్. పద్మ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఓ



## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓ హరికృష్ణ క్షేత్రస్థాయి పరిశీలన

### డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

### జూలై 20లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచన

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) హరికృష్ణ శనివారం భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్, సుభాష్ కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలను కలిసి ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, ఓటరు నమోదు, వివరాల సవరణ, మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. చదువుకున్న యువత ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని ఓటర్లకు సహకరించాలని, అలాగే కాలనీల్లోని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రజలకు ఫారాలు నింపడంలో సహాయం చేయాలని ఆర్డీఓ కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు సరైన వివరాలతో ఓటరు నమోదు చేసుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. భూపాలపల్లి పట్టణ పరిధిలో ఇప్పటివరకు ఓటరు వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియ కేవలం 14 శాతం మాత్రమే పూర్తైందని ఆర్డీఓ వెల్లడించారు. ఈ నేపథ్యంలో డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేయాలని సూపర్వైజర్లు, బీఎల్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ఈ నెల 20వ తేదీలోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీరాజయ్య, నాయబ్ తహశీల్దార్ అంజలి రెడ్డి, స్థానిక జీపీఓ దూలం కిరణ్, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## బునాదిగాని కాలువ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి రైతాంగానికి సాగు నీరు అందించాలి

### బస్వాపురం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి చెరువులను నింపి సాగునీరు అందించాలి




**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్:** బునాదిగాని కాలువ వెడల్పు మరియు కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి రైతాంగానికి సాగు నీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్వాపురం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి ఆయా గ్రామాలలోని చెరువులను నింపి రైతులకు సాగునీరు ఇబ్బందిని తీర్చాలని సూచించారు. శనివారం రోజు సుందరయ్య భవన్, భువనగిరిలో సీపీఎం భువనగిరి మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్న ఈ పరిస్థితులలో తక్షణం బునాదిగాని కాలువ పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులందరికీ సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. కాలువ నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు ప్రస్తుతం మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి నీటి పారుదల శాఖ ద్వారా ప్రభుత్వం రూ. 266.65 కోట్లను మంజూరు చేసినా ఎందుకు పనులు పూర్తి కావటం లేవని అధికారులను ప్రశ్నించారు. దాదాపు 20 ఏళ్లకు పైగా అసంపూర్తిగా ఉన్న ఈ కాలువ పనులు పూర్తయితే బీబీనగర్, భువనగిరి,వలిగొండ,ఆత్మకూరు (ఎం),మోత్కూరు,అడ్డగూడూరు మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, వేలాదిమందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన బాధ్యత తీసుకొని పనులను పూర్తి చేయాలని అన్నారు. బస్వాపురం ప్రాజెక్టులో ఉన్న నీటిని వెంటనే విడుదల చేసి మండలంతో పాటు వివిధ మండలాల్లోని చెరువులను నింపడం వల్ల రైతులకు సాగునీరు ఇబ్బంది తీరుతుందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకొని తక్షణం నీటి విడుదలకు తగు చర్యలు చేపట్టాలని నర్సింహ సూచించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య , మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ , కొండ అశోక్ , మండల కమిటీ సభ్యులు మోటె ఎల్లయ్య , కొండపురం యాదగిరి , కళ్లెం లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్న బీజేపీ శ్రేణులు

### కేక్ కటింగ్, రోగులకు పండ్ల పంపిణీ

### యువతకు ఆదర్శ నాయకుడని కొనియాడిన నేతలు





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మహాదేవ్‌పూర్ మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలతో కూడిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహాదేవ్‌పూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని సందర్శించిన బీజేపీ నాయకులు వైద్యురాలు డాక్టర్ నికిత సమక్షంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజ సేవే బీజేపీ సిద్ధాంతమని, నాయకుల జన్మదినాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పార్టీ సంప్రదాయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ మహాదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ జీవితం యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆదర్శప్రాయమని అన్నారు. శిశుమందిర్ విద్యార్థిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో విద్యార్థి నాయకత్వం, అనంతరం భారతీయ జనతా పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొని క్రమంగా జాతీయ నాయకుడిగా, కేంద్ర మంత్రిగా ఎదగడం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిగా బండి సంజయ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే నాయకత్వం ఆయనదని కొనియాడారు. కష్టపడే, నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తెలంగాణలో పార్టీ విస్తరణకు, ప్రజల్లో బీజేపీ బలోపేతానికి బండి సంజయ్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. రాబోయే రోజుల్లో యువత పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షితులై ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బండి సంజయ్ కుమార్ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి దేశానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆకుల శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు అంకరి రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శులు బల్ల శ్రావణ్ కుమార్, బొల్లం కిషన్, మాజీ ప్రధాన కార్యదర్శి సూరం మహేష్ రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చాగర్ల రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బుడే శేఖర్, కార్యదర్శి సంతోష్, మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దాడిగెల వెంకటేష్, కొక్కు రాకేష్, పోషన్న, చింటూ తదితరులు పాల్గొన్నారు.



## పాగర్తి ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన కార్యక్రమం పార్టీ మండల కార్యకర్తలతో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ కెంద్ర మంత్రి బండి సంజయ్ నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు, వారు సాధారణ కార్యకర్తగా పార్టీలో చేరి అంచెంచులుగా ఎదిగి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో కరీంనగర్ పట్టణ కన్వీనర్ గా పట్టణ ఉపాధ్యక్షునిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వర్తించారన్నారు ది కరీంనగర్ కో-ఓపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో రెండు పర్యాయాలు డైరెక్టర్‌గా పనిచేశారని భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి పట్టణ అధ్యక్షునిగా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా జాతీయ కార్యదర్శిగా వివిధ హోదాల్లో పార్టీలో పని చేశారని, అనంతరం భారతీయ జనతా పార్టీ కేరళ తమిళనాడు ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించారని అన్నారు 2005 లో ఏర్పడిన కరీంనగర్ నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి 48వ డివిజన్ నుండి బిజెపి కార్పొరేటర్ మూడుసార్లు గెలిచని అన్నారు సంజయ్ రెండు పర్యాయాలు కరీంనగర్ బిజెపి అధ్యక్షునిగా పనిచేశారని 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున కరీంనగర్ లోక్ సభ స్థానం నుండి గెలిచారని,అంతేకాక తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా,జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసారని, 2024లో 18వ. లోక్ సభ కరీంనగర్ లోక్ సభ నియోజక వర్గం గెలుపొందారిని, ప్రస్తుతం కెంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి గా పనిచేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు,బీజేపీ మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్ కొండా హర్షవర్ధన్ బీజేపీ మండల నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం సయ్యద్ మోహినుద్దీన్ కందరబోయిన గోపి,పుట్టా సత్యనారాయణ,పిట్టల సూరిబాబు,ఎలిగేటి గిరి, ఎలిగేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## రెడ్డి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద రెడ్డి విద్యార్థులకు ఉచిత శిక్షణ





**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్ :** ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రతి ఒక్క విద్యార్థికి ఉంటుంది అయితే ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే కొంత సమయంతో కూడుకున్నపని ఈ సమయంలో ఆర్థిక భారం అనేది ప్రధానమైన అడ్డంకి ఈ క్రమంలో ప్రభుత్వం తరఫున ఇతర కులాల వారికి వివిధ రూపాలలో ఆర్థిక సహాయం అందుతున్నది. కానీ అగ్రకులం అనే ఒక్క కారణంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి చేయూతనివ్వాలనే ఎలాంటి పథకం ద్వారా ఆర్థిక సాయం అందకపోవడం వలన వారు ఆర్థికంగా భారం మోయలేక ఎంతో ప్రతిభ ఉండి కూడా ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే కల కలగానే మిగిలిపోతుందని ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు నిరుత్సాహపడుతున్న తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని దృఢ నిశ్చయంతో రెడ్డి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ ని ఏర్పాటు చేయడం జరిగింది . ఈ ట్రస్ట్ ద్వారా రానున్న రోజుల్లో ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ పడుతుంది అన్న తరుణంలో వారికి ఉచిత శిక్షణ వసతిగృహం గ్రౌండ్ ప్రాక్టీస్ ఇవ్వాలని మొదటి బ్యాచ్ గా 35 మంది రెండో బ్యాచ్ గా 36 మందికి రెడ్డి జాగృతి ట్రస్టు ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నాం అని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి అన్నారు.వారిని సంప్రదించడానికి సేల్ నెంబర్:9533099999,మరియు వాట్సప్ నెంబర్:9290906777ద్వారా సంప్రదించవచ్చును.

# ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్..

**ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు**

**కాలనీవాసుల్లో ఆందోళన**



**నిజాంపేట్, జూన్ 11 (క్రైమ్ మిర్రర్):** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ లో గల ఎన్ఆర్ఐ కాలనీ, చందు లేఅవుట్‌లో ప్రధాన రహదారిపై ఉన్న వరదనీటి కాలువ మ్యాన్‌హోల్ గ్రిల్ పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్ప టికీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై ఎన్ ఆర్ ఐ కాలనీ వెల్ఫర్ సంఘం అధికార ప్రతినిధులు బొట్ల తిరుపతి మరియు వడ్లకొండ సందీప్ పలుమార్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు 'మైక్యూర్ యాప్ ద్వారా, అలాగే ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు కొత్త గ్రిల్ ఏర్పాటు చేయకుండా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారని వారు పేర్కొన్నారు. గత మార్చి నెల నుండి కూడా ఇదే సమస్యపై ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కేవలం తాత్కాలికంగా వెల్డింగ్ నిర్వహించారని, పూర్తిగా దెబ్బతిన్న గ్రిల్‌ను మార్చాలని పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోయిందని కాలనీ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లపై నీరు నిలిచిన సమయంలో ఈ తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ కనిపించకుండా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వాహనదారులు, పాదచారులు, చిన్నారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దెబ్బతిన్న మ్యాన్‌హోల్ గ్రిల్ స్థానంలో కొత్త గ్రిల్ ఏర్పాటు చేయాలని, అలాగే సమస్యను నిర్లక్ష్యం చేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# చౌటుప్పల్‌ను కాలుష్య కోరల్లోకి నెట్టొద్దు

**పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి...**

**నిబంధనలు ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి...**

**ప్రజల ఆరోగ్యం, యువత ఉపాధి పై ఎమ్మెల్యే మౌనం వీడాలి**

**బీఎస్పీ ఇంచార్జ్ ఐతరాజు అబ్బేందర్**




**చౌటుప్పల్,జూలై 11, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న పారిశ్రామిక కాలుష్యంపై బహుజన్ సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ ఐతరాజు అబ్బేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... పరిశ్రమలు, ఫార్మా కంపెనీల విస్తరణ కారణంగా గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురవుతున్నాయని, దీనివల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోందని ఆరోపించారు. కాలుష్య సమస్యపై ప్రజలు పలుమార్లు ఆందోళనలు చేస్తున్నప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని అబ్బేందర్ విమర్శించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రజల ఆరోగ్యం,యువత ఉపాధిపై మౌనం విడాలన్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సమయంలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. చౌటుప్పల్ ప్రాంతంలోని గాలి నాణ్యత, తాగునీరు, భూగర్భ జలాలు, వ్యవసాయ భూముల పరిస్థితిపై స్వతంత్ర శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి నివేదికలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు స్థానిక వనరులను వినియోగించుకుని లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, స్థానిక నిరుద్యోగ యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని అబ్బేందర్ అన్నారు. "మా భూములను ఉపయోగిస్తున్నారు... మా నీటిని వినియోగిస్తున్నారు... మా గాలిని కలుషితం చేస్తున్నారు... కానీ స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమల్లో కనీసం 80 శాతం ఉద్యోగాలను స్థానిక యువతకే కల్పించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులకు ఉపాధి కల్పించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనాధారం, స్థానిక యువత భవిష్యత్ కంటే ఏ అభివృద్ధి గొప్పది కాదని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, ఇంచార్జ్ బొట్ట శివ, నియోజకవర్గ అధ్యక్షులు తగరం సుభాష్ చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి సుక్క బుగ్గ రాములు, నాయకులు కృష్ణ, నాగిళ్ల మారయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను నెల రోజుల పాటు పొడిగించాలి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ**




**చౌటుప్పల్, జులై 11, క్రైమ్ మిర్రర్ :** ఓటర్లను చైతన్యం చేయడంలో అధికార యంత్రాంగం విఫలం చెందుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగొని సత్యనారాయణ అన్నారు. శనివారం జరిగిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో నిర్వహిస్తున్న సర్ లో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తెలిసి తెలియక పూర్తి చేసి ఇబ్బందులు గురి అవుతున్నారని. ఓటర్లను బి ఎల్ ఓ లు తమ దగ్గరికే వచ్చి ఫారలు తీసుకోవాలని చెబుతున్నారని, ఇంటింటికి తిరిగి ఫారాలు పంపిణి చేయడం లేదన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి ఓటర్లకు సరైన అవగాహనా కల్పించే విదంగా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సర్ ప్రక్రియ అనేది పారదర్శకంగా జరగాలి తప్ప బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రగా చేయకూడదని డిమాండ్ చేశారు. ఓటర్లను గుర్తించడం ఆలస్యం వల్ల మరో నెల రోజులు పొడిగించి న్యాయమైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ . ఇమ్రాన్,మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరి వెంకటేష్,దాసరి అంజయ్య, టంగుటూరు రాములు, రోషణగారి అంజయ్య, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, నీళ్ల బిక్షపతి, కాకి పాండు,కుంటి పాపయ్య, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామం లో అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల....




**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** మాదాపూర్ లో ని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. బెంగళూరు నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి శ్రీమతి సంజన గోగేట్ తన ప్రదర్శనలో తోడి సొరకట్టు, భజరే మానస, తుమక చలత భజన, తిల్లాన , అన్నమాచార్య కృతి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన లో భాగంగా శ్రీ సాయినాథ్ ఆధ్వర్యం లో భారతీయ కళాక్షేత్రం గురువు శ్రీ శ్రీనివాస్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో తాండవ నృత్య కారి, మండూక శబ్దం, అదిచూడరే , జతిస్వరం, జానపద నృత్యం, భామాకలాపం, హనుమాన్ చాలీసా, అయిగిరి నందిని, దశావతారం, నమో నారాయణ , మంగళం అంశాలను తేజశ్రీ, శిరీష, ప్రణీత, గీతామృత, కుముద, సమన్విత, ఐశ్వర్య, శాన్వి, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# ఘనంగా బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

**చౌటుప్పల్,జూలై 11,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలో చౌటుప్పల్ బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణ గోని శంకరయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు బుచ్చయ్య, గుండెబోయిన వేణు, బూత్ అధ్యక్షులు ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.





# వాట్సప్‌లోనే అన్ని సర్టిఫికేట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. ఎలాగంటే?

**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్:** వాట్సప్‌లోనే అన్ని సర్టిఫికేట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. ఎలాగంటే? టెక్నాలజీ యుగంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు,రైల్వే, బ్యాంకులు,ఇతర సంస్థలు వాట్సాప్ ఆధారిత సేవలను అందుబాటులోకి తెచ్చాయి. దీని ద్వారా ప్రజలు తమ గుర్తింపు ధృవీకరణ పత్రాలు,మార్క్ షీట్లను మైగవ్ హెల్ప్ డెస్క్ (9013151515)ద్వారా పొందవచ్చు. ఇండియన్ రైల్వే ప్రయాణికులకు ఆహారం (70420 62070),కిరాణా సామాగ్రి (8881199119)ఆర్డర్ చేసే సదుపాయాన్ని కల్పించింది. ఎస్బీఐ(90226 90226) మరియు ఐసిఐసీఐ బ్యాంక్ (86400 86400)వంటివి వాట్సప్ ద్వారా బ్యాంక్ బ్యాలెన్స్,మినీ స్టేట్‌మెంట్ వంటి సేవలను అందిస్తున్నాయి. అంతేకాకుండా,ఇండేన్ గ్యాస్ (75888 88824),హెచ్పీ గ్యాస్ (92222 01122),భారత్ గ్యాస్ (18002 24344) నంబర్ల ద్వారా గ్యాస్ సిలిండర్లను కూడా సులభంగా బుక్ చేసుకోవచ్చు.

# నేతాజీ నగర్ లో పర్యటించిన ఎమ్మార్వో

**ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ నమోదు చేయాలని కోరిన బేరీ రాశీచందర్ యాదవ్.....**



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్తీలో చాలా మంది నిరుపేదలు నివసిస్తున్నారు. కాబట్టి వారికి చదువు రాకపోవడంతో ఫారాలు నింపడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కాలని అధ్యక్షుడు బేరి రామ్ చందర్ యాదవ్ అన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన కోరిక మేరకు నేతాజీ నగర్ కాలనీలో ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని బిఎల్ఎ, బిఎల్ఓ లకు వివరించారు. కాలనీ అధ్యక్షులు రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు సహకరించాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. అవసరమైతే అధికారుల ను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి దీపక్ కుమార్, బి ఎల్ ఓ పరమేష్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, బుడగ జంగాల పంతం వెంకటేష్, పంతం శీను, నాగపురి నగేష్ యాదవ్, ఎండి జాఫర్, శివ యాదవ్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు కాలనీ పెద్దలు మహిళా సోదరుల యోజన నాయకులు పాల్గొన్నారు

# ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారలు...

**పాపి రెడ్డి నగర్ లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం...**



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంటెస్టేడ్ ఎమ్మెల్యే, బీజేపీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మరియు శేరిలింగంపల్లి డివిజన్ కాంటెస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్ ఆదేశల మేరకు శనివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో ని పాపిరెడ్డి నగర్ లో ఆరంభ టౌన్ షిప్ లో బూత్ నెంబర్స్ కలిసి పాపి రెడ్డి నగర్ బూత్ నెంబర్ లు 181మరియు 182. మరియు ఆరంభ టౌన్ షిప్ బూత్ నెంబర్ లు 170,172, మరియు 176 లో గల బీ ఎల్ ఏ లు సీనియర్ బీజేపీ నాయకులు టీ నర్సింలు ఆధ్వర్యంలో సీనియర్ బీజేపీ నాయకులు బాలు, సుబ్బు, సన్నీ,బాబు,అజయ్ కుమార్.విజయ లక్ష్మీ ఎమ్ ఎస్ రావు ల తో . కలిసి కాలనీ లో ఉన్న ప్రతి ఒక్క ఓటర్ లను ఎస్ ఐ ఆర్ ఫారం లు నింపి బీ ఎల్ ఓ ల కు అందజేయాలని వారు కోరారు.

# వంగపల్లి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపు.

## రూ.224 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన సభలో పాల్గొననున్న మంత్రులు,ఎంపీ, ఎమ్మెల్యేలు



**ఆత్మకూరు(ఎం),జూలై11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో ఆదివారం రోజు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రోజు మీడియా సమావేశం నిర్వహించిన బీర్ల అయిలయ్య,ఆదివారం రోజు నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెఛ్ఏఎం)పథకం కింద ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.224 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు వంగపల్లి గ్రామంలో ఘనంగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, హాజరుకానున్నట్లు వెల్లడించారు.అలాగే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసీఎస్)నూతన చైర్మన్లు, డైరెక్టర్లను ఇదే వేదికపై ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

**రూ.224 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులు:**

ఆలేరు -- జీడికల్ రహదారికి రూ.17 కోట్లు;జీడికల్ --గుండాల -- మోత్కూర్ రహదారికి రూ.35 కోట్లు; వంగపల్లి -- ఖ్రాయిపల్లి రహదారి : రూ.90 కోట్లు;ఆలేరు -- జగదేవ్‌పూర్ (చల్లూరు, ఇబ్రహీంపూర్ మీదుగా) : రూ.61 కోట్లు;తుర్కపల్లి -- రంగపూర్ (మాదాపూర్, చీకటిమామిడి మీదుగా)రూ.20.60 కోట్లు;ఈ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి పైలాన్‌ను మంత్రులు ప్రారంభించనున్నట్లు బీర్ల అయిలయ్య తెలిపారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో,రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా ఆటోగ్రాఫ్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క,రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించగలరని, వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఆదివారం రోజు నిర్వహించనున్న ఈ చారిత్రాత్మక బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,పిఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులు, యువత, మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు.



# అమ్మ ఆదర్శం యూత్ ఆధ్వర్యంలో విద్యా కిట్ల పంపిణీ

## విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది:ఏసీపీ కిరణ్ కుమార్

**మందమర్రి టౌన్ జూలై 11 క్రైమ్ మిర్రర్:** విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా అమ్మ ఆదర్శం యూత్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఒర్రెగడ్డ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 200 మందికి పైగా విద్యార్థులకు రూ.30 వేల విలువైన విద్యా కిట్లను పంపిణీ చేశామని తెలిపారు.ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాదని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో విద్యకు మించిన సంపద లేదని పేర్కొన్నారు.అనంతరం మందమర్రి సీఐ పర్సా రమేష్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకులు బండారి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడం, నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, శ్రీధర్, అమ్మ ఆదర్శం యూత్ సభ్యులు సాతిని సంజీవ్, సిద్దర్ల రాహుల్, విరుగురాల వినయ్, గంధం సంతోష్, గాదె మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోకిల తండాలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్

## బీఎల్‌వో కేంద్రాల సందర్శన.. ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు



**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని మోకిల, మోకిల తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఎల్‌వో కేంద్రాలను శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ సందర్శించి ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న కొత్త ఓటర్ల నమోదు, పేర్ల చేర్పు, సవరణలు, తొలగింపుల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీడీవో, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా నమోదు ప్రక్రియను నిర్వహించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అన్ని దరఖాస్తులను పరిశీలించి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో మోకిల గ్రామ సర్పంచ్ శేఖర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌండ్రా సత్యం, పీఏసీఎస్ అధ్యక్షుడు గోపాల్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి నరసింహ, సంబంధిత బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ సూచించారు.

# లార్డ్స్ హైస్కూల్ ఘనంగా "బేబీస్ డే అవుట్" కార్యక్రమం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్ ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం వినూత్నంగా "బేబీస్ డే అవుట్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయులు తల్లిదండ్రులుగా మారి చిన్నారుల మనోభావాలు, అభ్యాస విధానం, ఎదుగుదలపై పరస్పర అవగాహన పెంపొందించుకునే అవకాశాన్ని కల్పించారు. పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో పిల్లలు--తల్లిదండ్రులు--ఉపాధ్యాయులు అనే సమన్వయ త్రికోణం ఎంతో కీలకమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. తల్లిదండ్రులు, చిన్నారులు కలిసి పాల్గొనేలా అనేక వినోదాత్మక, విద్యాపరమైన ఆటలు నిర్వహించగా, కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా విద్యార్థి తల్లి సుజాత మాట్లాడుతూ, "ఈరోజు మేము ఉపాధ్యాయుల పాత్రను స్వయంగా అనుభవించడంతో వారి కృషి ఎంత గొప్పదో తెలుసుకున్నాము. పిల్లల సమగ్రాభివృద్ధి కోసం లార్డ్స్ హైస్కూల్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఎల్. మారియన్ తల్లిదండ్రులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సహృదయంతో సహకరిస్తారు" అని అన్నారు.పాఠశాల యాజమాన్యాన్ని కూడా తల్లిదండ్రులు ప్రశంసించారు. చిన్నారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న చైర్మన్ సిద్దల బీరప్ప, వ్యూహాత్మక ప్రణాళికలతో విద్యా ప్రమాణాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను ఆప్యాయంగా పరిష్కరిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న డైరెక్టర్ సిద్దల శ్రీలత నాయకత్వాన్ని కొనియాడారు.తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరియు యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొనడంతో "బేబీస్ డే అవుట్" కార్యక్రమం రంగులమయంగా, విజయవంతంగా ముగిసింది. పిల్లల సమగ్రాభివృద్ధికి పాఠశాల--తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# ఎన్యుమరేషన్ పత్రాన్ని గడువులోపు పూర్తి చేసి తిరిగి ఇవ్వాలి




బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ --2026 కార్యక్రమ పురోగతిని మీడియాకు వివరించారు. ఓటరు జాబితాను సంపూర్ణంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. బడంగ్‌పేట్ ~జు=~ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించడంలో ఏవైనా సందేహాలు ఉన్నా, లేదా 2003 నాటి ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలను తెలుసుకోవాల్సి వచ్చినా, ఆయా హెల్ప్‌డెస్క్‌లలో అధికారులు మరియు వాలంటీర్లు అవసరమైన సహాయాన్ని అందిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా పూరించి, సంబంధిత పోలింగ్ బూత్ స్థాయి అధికారి (దీూా)కి జూలై 24లోగా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. గడువులోగా ఫారం సమర్పించని పక్షంలో, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారి ఓటరు నమోదుపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. సర్--2026 కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా మీడియా తమ వంతు సహకారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమ ంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం--50, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జగదీశ్వర్ రెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్--16 డిప్యూటీ కమిషనర్ / ~జు=~ సమ్మయ్య, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# భవిష్యత్తులో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కష్టపడి సాధించిన డిగ్రీ పట్టాతో విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు వక్తలు సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఎం డిగ్రీ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఎస్ కె మహబూబ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, డి.ఎస్.పి వెంకట్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ సహస్ర పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి సమాజం పట్ల కుటుంబం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి కావలసిన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ డిగ్రీ పట్టా ద్వారా వచ్చిన గౌరవాన్ని సమాజంలో పొందాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం నవీన్ నేహా భాగ్యలక్ష్మి ప్రసాద్ రమ్యరాణి, అమీర్, మాదేహ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురిని చంపి నరరూప రాక్షసుడు

## బాలికను బలవంతంగా కారులో తరలింపు

## సిసిటివీల్లో రికార్డు అయిన దృశ్యాలు

రంగారెడ్డి: పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మైనర్ బాలికను నిందితుడు రాజ్‌కుమార్ బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్‌పై మే 16వ తేదీన పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక (17)ను వేధించాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 26వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే శుక్రవారం అతను జైలుపై విడుదలయ్యాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి, ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుపడ్డారు. దీంతో వారిద్దరినీ కత్తితో పొడి చంపాడు. అనంతరం బాలికను దైవాలగూడ సమీపంలోని చెరువు దగ్గరకు తీసుకెళ్లి పీకకోసి హత్య చేశాడు.

# ఆశీర్వాద సభ కాదది అబద్ధాల ప్రచార సభ

**కాంగ్రెసోల్లకు హిందూ దేవుళ్ళ మీద నమ్మకం లేకే ఒట్లు వేస్తున్నారు.. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పెగడపల్లి:ఖమ్మం జిల్లాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ అబద్దాలని ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్దాలను ప్రచారం చేసుకోవడం కోసమే సభ పెట్టినట్లు ఉందని అది ఆశీర్వాద సభ కాదని అబద్ధాల ప్రచార సభ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. ముఖ్యమంత్రి రైతుల విషయంలో చెప్పిన అంకల గారడి లెక్కలు ఆచరణలో అమలు కాలేదని గతంలో రెండు లక్షల రుణమాఫీ విషయంలో రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశామని కానీ అవి రైతులకు అందాయో లేదో మాకు తెలియదని చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఆరు రైతు భరోసాలు రావాల్సి ఉండగా మూడుసార్లు మాత్రమే అరకొరగా వేసి రైతులందరికీ ఆరు సార్లు రైతు భరోసా అందించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చినాకనే తెలంగాణ ప్రాంతంలో బిజెపి జాతీయ నాయకులు అడుగు పెట్టాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగా అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. 2023 ఎన్నికల ముందు మీరు ఇచ్చిన అన్ని డిక్లరేషన్లతో పాటు ఆరు గ్యారంటీలు 420 హామీలు అన్ని పూర్తి చేశాకే గ్రామాల్లో అడుగుపెట్టాలని లేకుంటే గ్రామాల్లో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. అంతేగాని అధికారం ఉందని మీడియా ముందు ఏది మాట్లాడితే అది టీవీలో పేపర్లో వస్తుందని భ్రమ పడితే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం దగ్గర్లోనే ఉందన్నారు. 2034 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని భద్రాద్రి రాముడు మీద ఒట్టేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల మీద దేవుళ్ళ మీద ఒట్టేసి ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని కాంగ్రెస్ పార్టీ అంటేనే ముస్లింలు అని ముస్లింలు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని అవసరమైతే నన్ను రేవంతోద్దేన్ అని పిలిచిన అభ్యంతరం లేదని గతంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసి హిందూ దేవి దేవతలను అవమానించడమేనని అన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి హిందువులపైన హిందూ ధర్మం పైన హిందూ దేవాలయాల హిందూ దేవి దేవతల పైన నమ్మకం గౌరవం లేదు కాబట్టే ప్రమాణాలు చేసి పబ్బం గడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు ఓటేసింది ఐదు సంవత్సరాల కాల పరిమితికి గాని 10 సంవత్సరాల కాల పరిమితికి కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తెరగాలని అన్నారు. ఖమ్మం సభకు 500 కిలోమీటర్ల దూరం నుండి ప్రభుత్వ బస్సులను తెప్పించుకొని ప్రజా రవాణా విషయంలోప్రజలను ఇబ్బంది పెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు.

# జిల్లాలో సీఎం సభతో జిల్లా విద్యా రంగానికి ఒరిగిందేమీ లేదు

**విద్యారంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం. ప్రవీణ్**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం నగర కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు రెడ్డి పోగుల త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ కోట్ల రూపాయలకు ఖర్చుపెట్టి నిన్న ఖమ్మం జిల్లాలో నిర్వహించిన సీఎం సభ వలన జిల్లా విద్యారంగానికి ఒరిగిందేమీ లేదని విద్యా రంగంలో జిల్లాలో ఎక్కడున్న సమస్యలు అక్కడే ఉన్నాయని ఎన్నికల మేనిఫెస్టోలో సైతం ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని పెట్టిన కాంగ్రెస్ నాయకత్వం దాని గురించి మాట కూడా ఎత్తలేదని అదేవిధంగా జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పే లెక్చరర్సే లేరని ఇప్పటివరకు కూడా సొంత భవనాన్ని కట్టినటువంటి పరిస్థితి లేదని అన్నారు. మరల మధిరలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు కానీ ఈ ప్రకటనలు ప్రకటనలు గానే కాకుండా కళాశాల ను ఏర్పాటు చేసి అక్కడ విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలను పాఠాలు చెప్పడానికి లెచరర్స్ ను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు కోసం యూనివర్సిటీలకు వెళ్లాలంటే వరంగల్ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లలేక విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం దానిని దృష్టిలో పెట్టుకుని వారు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని నెరవేర్చి జిల్లాలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిన్న ముఖ్యమంత్రి జిల్లాకు వస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో విద్యా సంస్థలలో ఉన్న విద్యార్థులు మొత్తం స్వచ్ఛందంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ కు మద్దతు తెలిపారని ఇది చూసి అయినా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యఖపరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వంకాయల. రాజు ఖమ్మం నగర నాయకులు లోకేష్ శ్యామ్ లోహిత్ కుమార్ భారత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**వర్షాకాలంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జనాభా నియంత్రణ తల్లి-శిశు ఆరోగ్యం సమతుల్య కుటుంబ వ్యవస్థ బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత పోషకాహార లోపం ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని కొబ్బరి చిప్పలు పాత టైర్లు ప్లాస్టిక్ డబ్బాలు కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత పరిశుభ్రత తాగునీటి సదుపాయాలు వంట పాత్రల శుభ్రత ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి. రామారావు అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి పి హెచ్ సి ఎం వి పాలెం నుంచి హెచ్ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

# సాయికృష్ణ విచారణలో అడ్డంకిగా నిబంధనలు

**సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం**

అమరావతి,జూలై11: సాయికృష్ణ లాకప్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఐ నాగరాజు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన కఠిన నిబంధనలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న షరతును సిట్ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. నిరంతర వీడియో నిఘా వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రికన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టు కండీషన్లు అడ్డంకిగా మారాయని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేసింది.



# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్ కరపత్రం విడుదల

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్ ):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను దగా చేస్తున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సిఎచ్ చైతన్య అన్నారు. ఇన్సూరెన్స్ హెల్త్ టెస్టుల పేరుతో కొట్లాడి రూపాయలు దుర్వినియోగాన్ని, లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలనీ జూలై 20వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మీర్ పేట్ భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో "చలో కలెక్టరేట్" కార్యక్రమం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు సన్నద్ధం అయ్యిందని, దీంతో బిఓసిడబ్ల్యూ చట్టం 1996 కనుమరుగు అవుతుందని ఇది కార్మికులకు చాలా నష్టమని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జిఓ నెంబర్ 12ను రద్దు చేయాలనీ, వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందించాలని, సీఎస్సి సంస్థ హెల్త్ టెస్టులను రద్దు చేసి ప్రభుత్వమే హెల్త్ కార్డులు ఇవ్వాలని, అడ్డలో మౌలిక వసతులు కల్పించి, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరి కమిటీని నియమించి కార్మికుల సంక్షేమం కోసమే నిధులు ఖర్చు చేయాలనీ, ప్రతీ కార్మికులకు లేబర్ కార్డులు ఇవ్వాలని, ఇండ్లు లేని వాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల పరిష్కారంకై ఈ నెల 20వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సిఐటియు నాయకులు దాసరి బాబు, బాలాపూర్ మండలం అధ్యక్షుడు నేల వెంకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి నరసింహ, కోశాధికారి మల్లికార్జున్, ఉపాధ్యక్షులు ఆదాము ఉప, అధ్యక్షులు బుర్రను దాసు, చంద్రశేఖర్ కుమార్ తదుపరులు పాల్గొన్నారు.

# పలివెల చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా చెరుకు మార్కో కొండయ్య



మునుగోడు (క్రైమ్ మిర్రర్) : మునుగోడు మండలం పలివెల గ్రామంలోని బాలాజీ సిల్క్ చేనేత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో చెరుకు మార్కో కొండయ్య ప్యానల్‌కు చెందిన 9 మంది డైరెక్టర్లలో 6 మంది విజయం సాధించడంతో ఆయన సంఘ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చెరుపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా చెరుకు సైదులు, కోశాధికారిగా గండూరి సుజాత ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పూల శ్రీనివాసు, చెరుకు శ్యామల, చెరుకు మల్లయ్య, బడుగు సతీష్, బడుగు నరసింహ గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చెరుకు మార్కో కొండయ్య మాట్లాడుతూ, సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని, చేనేత కార్మికుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను పలువురు చేనేత కార్మికులు, గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**ఆకస్మిక తనిఖీలో ఆర్డీఓ రమణారెడ్డి**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 11: ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని మిర్యాలగూడ ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సుందర్‌నగర్ వార్డులోని 57, 58, 59 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫారాలు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటర్ల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి స్థాయి ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బీఎల్ఓలకు పూర్తి సహకారం అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్ నూతన బస్ స్టేషన్‌కు మంత్రుల శంకుస్థాపన

## అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఫ్రీ బస్సు

## ఇప్పటివరకు 11 వేల కోట్ల వరకు ఉచిత బస్ ప్రయాణాలు జరిగాయి

## ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలనేది ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## హుజుర్నగర్ లో 3.52 కోట్లతో బస్సు స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

## హుజూర్ నగర్ బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం

## పౌరసరఫరాలు,నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ , హుజూర్ నగర్ :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని రాష్ట రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుజుర్నగర్ లో 3.52 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్సు స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు,నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 3.52 కోట్ల రూపాయలతో బస్సు స్టేషన్ నిర్మాణం చేసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించడం ద్వారా ఇప్పటివరకు 326 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయని, మహిళలకు 11,400 కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూర్చామని అన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం




ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తదుపరి ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హుజూర్‌నగర్ లో బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత పట్టణ ప్రజలు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు

## నేరేడుచర్ల ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్య బృందం సేవలకు ప్రశంసలు

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా. పున్న నాగిని నేతృత్వంలోని వైద్య బృందం ఒకే రోజు కేవలం నాలుగు గంటల వ్యవధిలో రెండు సాధారణ ప్రసవాలు నిర్వహించి తల్లి, శిశువుల ఆరోగ్యాన్ని కాపాడారు.మొదటి ప్రసవం దిర్శించెర్ల గ్రామానికి చెందిన శ్రీకన్య రెండో కాన్పు కోసం పురిటి నొప్పులతో శుక్రవారం సాయంత్రం ఆసుపత్రికి చేరుకున్న ఆమెకు డా. పున్న నాగిని ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6.00 గంటలకు సురక్షితంగా సాధారణ ప్రసవం నిర్వహించగా, 3.5 కిలోల బరువున్న పండంటి మగబిడ్డ జన్మించాడు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఇదే సమయంలో పాలకవీడు మండలం అలింగపురం గ్రామానికి చెందిన అంజలి మూడో కాన్పు కోసం ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమెకు కూడా వైద్య బృందం అన్ని పరీక్షలు నిర్వహించి, రాత్రి 9.45 గంటలకు సురక్షితంగా సాధారణ ప్రసవం చేశారు. ఆమె కూడా 3.5 కిలోల బరువున్న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యాధికారిణి డా. పున్న నాగిని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహకారం జిల్లా వైద్యాధికారి ప్రోత్సాహం తో ప్రైవేట్



ఆసుపత్రులకంటే దీటుగా ప్రసూతి గదికి కావలసిన అన్నీ రకాల పరికరాలు, సౌకర్యాలు కల్పించడం వలన గర్భిణీ స్త్రీలు ఏ సమయంలో సాధారణ ప్రసవం కోసం వచ్చినా ధైర్యంగా సాధారణ, సురక్షిత ప్రసవాలు చేయగలుగుతున్నాము అన్నారు. గర్భిణులు ప్రసవ సమయం దగ్గరపడిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ప్రసూతి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.స్థానిక ప్రజలు నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలను అభినందిస్తూ, వైద్యాధికారి డా. పున్న నాగిని,ఆమె బృందాన్ని ప్రశంసించారు.

# షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

- **ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో**
- **ఫోక్సో కేసు పెట్టారని ముగ్గురి హత్య**
- **విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత**
- **అనంతరం గ్రామం నుంచి పరార్**
- **నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**
- **సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన**

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేధం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు.





# ఎస్ఐఆర్ డిజిటైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

క్రైం మిర్రర్ కుల్కచర్ల:ఎఫ్ఐఆర్ డిజిటైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు.ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్--2026 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.శనివారం కుల్కచర్ల మండలములో జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.ఇప్పటివరకు స్వీకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోపు తప్పనిసరిగా ఆన్‌లైన్లో అప్లోడ్ చేసి డిజిటైజేషన్ ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆయన సూచించారు.అలాగే, ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ సంబంధిత బి.ఎల్.ఓలని సంప్రదించి ఫారాలను సమర్పించాలని ఆయన కోరారు. ఫారాలు సమర్పించని వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉన్నందున అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని బి.ఎల్.ఓ లకు సమర్పించాలని సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువుపై అరా తీశారు.గత సంవత్సరం కంటే ఈ సంవత్సరము పదవ తరగతి చదివే విద్యార్థినిలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆగస్టు 15 వరకు యూనిఫామ్ కుట్టించి విద్యార్థులకు అందజేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు అధికారులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడిఓ రామకృష్ణ, డిఇఓ అబ్దుల్ ఘని,ఎంఇఓ హబీబ్ హమ్మద్, డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ వార్వాల్ల అంజిలయ్య సూపర్వైజర్లు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వేగవంతం చేయాలి

## బూత్‌ల పరిశీలనలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, క్రైమ్ మిర్రర్:** ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు.మండలంలోని యాద్గారుపల్లి గ్రామం, పట్టణంలోని 38వ వార్డు వినోభానగర్ బూత్‌లను శనివారం ఆయన సందర్శించి నిర్వహణను పరిశీలించారు. ఓటరు నమోదు, వివరాల సవరణ, దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని తెలిపారు. బీఎల్ఏలు కూడా అధికారులతో సమన్వయంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.